క్లుప్తంగా

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

వెంకటగిరి: అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకుని గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పోస్టర్లను ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ తిరుపతి జిల్లా స్థాయిలో ఐటీడీఏ కల్పించిన అటవీహక్కుల చట్టం ద్వారా గిరిజన కుటుంబాలకు పది ఎకరాలు భూమి కల్పించాలని కోరారు. ఆగస్టు 9న స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ వెంకటేశ్వరరావు

గూడూరురూరల్: మైనర్లకు నడిపేందుకు వాహనాలను ఇవ్వొద్దని సీఐ వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు సూచించారు. రెండవ పట్టణంలోని కోర్టు సెంటర్‌లో ఆదివారం టూటౌన్ సీఐ వెంకటేశ్వరరావు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను నడుపుతున్నారని అలాంటి వారిని గుర్తించి వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి మరోసారి వాహనం నడుపుతూ పట్టుబడితే జరిమానా విధించడంతో పాటు వాహన లైసెన్స్‌లు రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహనచోదకులు తప్పని సరిగా ధ్రువపత్రాలను పెట్టుకోవాలని ఆయన సూచించారు.

విశేష అలంకరణలో ముత్యాలమ్మ



చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవను నిర్వహించిన అనంతరం అభిషేకాలు చేసి విశేష అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించే భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించారు. మహిళలు ఆలయంలోని రావిచెట్టు వద్ద ఊయలలు కట్టి వరపడ్డారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులకు గంటకుపైగా పట్టింది.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కొడవలూరు ధనుంజయరెడ్డి

కోట: మద్దాలి పంచాయతీ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనుంజయరెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. మండలంలో మారుమూల గ్రామాలైన మద్దాలి, మద్దాలికండ్రిగలో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ధనుంజయరెడ్డి పనులను ప్రారంభించారు. సర్పంచ్ వాణి, జెడ్పీటీసీ సభ్యుడు కోటయ్య, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మమ్మ, నేతలు చేవూరు నాగేశ్వరరావు, శివరాంనాయుడు, నాగరాజు, శేషమ్మ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన బైక్

పెళ్లకూరు: బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈఘటన మండలంలోని పునబాక–చెంబేడు రోడ్డులో శిరసనంబేడు గ్రామం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. రాజుపాళెం గ్రామానికి చెందిన పవన్ బైక్‌లో నాయుడుపేటకు ఆదివారం బయలుదేరాడు. శిరసనంబేడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వెళుతుండగా బైక్‌ను లారీ ఢీకొంది. ఈఘటనలో పవన్‌కు తీవ్రగాయాలు కాగా, బైక్ పూర్తిగా ధ్వంసమైంది. గాయపడ్డ అతన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకాశంతో పోటీ..నాకెవ్వరు సాటి!



రెండో ప్రయోగ వేదికకు సంబంధించి రెండు వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లు



మొదటి ప్రయోగవేదికకు సంబంధించి పీఎస్ఎల్‌వీ అనుసంధాన భవనం, ఎంఎస్‌టీ టవర్‌లు ఉన్న ఏరియల్ వ్యూ

- ప్రయోగాల్లో దూసుకెళ్తున్న ఇస్రో
- ఏడు నెలల్లో ఆరు..వచ్చే ఐదు నెలల్లో నాలుగు ప్రయోగాలు
- స్పేస్ రీఫార్మ్ ఇయర్ అంటే ఇదేనేమో!

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సంవత్సరానికి 12 ప్రయోగాలు నిర్వహించి స్పేస్ రీఫార్మ్ ఇయర్‌గా నిలవాలనే సంకల్పం ఈ ఏడాది నెరవేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏడు నెలల్లో ఆరు ప్రయోగాలను పూర్తిచేసి వచ్చే ఐదు నెలల్లో నాలుగు ప్రయోగాలు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. మరో రెండు ప్రయోగాలు చేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు అంతరిక్ష కేంద్రాలు లేకపోవడంతో అత్యంత తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను రోదసీలోకి తీసుకెళ్లి ప్రవేశపెట్టగలిగిన సత్తా కలిగిన దేశంగా భారత్ ప్రపంచపటం మీద కనిపిస్తోంది. గడిచిన 44 ఏళ్ల క్రితం చిన్న చిన్న ప్రయోగాలతో సంవత్సరానికి ఒక ప్రయోగం చేసుకునే స్థాయి నుంచి నేడు సంవత్సరానికి 10 నుంచి 12 ప్రయోగాలు చేసే స్థాయికి చేరడమే కాకుండా ప్రపంచదేశాలకు చెందిన ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి సంవత్సరానికి రూ.2 వేల కోట్లు ఆదాయాన్ని తీసుకొచ్చే సంస్థగా ఇస్రో ప్రపంచాన్ని చాలెంజ్ చేస్తోంది. పెద్దపెద్ద ఉపగ్రహాలను అమెరికా, చైనా, ఫ్రాన్స్ లాంటి దేశాలు అత్యంత ఎక్కువ వ్యయంతో చేస్తున్నారు. అలాంటి దేశాలే నేడు చిన్నచిన్న ఉపగ్రహాలను మన దేశానికి తీసుకొచ్చి ప్రయోగించుకుని వెళ్లే స్థాయికి భారత్ చేరడం విశేషమే కదా! పెద్ద పెద్ద ఉపగ్రహాలను సైతం ఇస్రో బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3 రాకెట్ ద్వారా చేస్తున్నారు. గత ఏడాది, ఈ ఏడాది ఆరు టన్నుల బరువు కలిగిన 72 ఉపగ్రహాలను సునాయాసంగా ప్రయోగించి పెద్ద ఉపగ్రహాలను కూడా వాణిజ్యపరంగా ప్రయోగించగలమనే నమ్మకాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పారు. నేడు భారత శాస్త్రవేత్తలు అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని రోజురోజుకు అభివృద్ధిచెందుతూ కొత్తపుంతలు తొక్కిస్తున్నారు...

వివరాల్లోకి వెళితే..

1979 ఆగస్టు 10 మొట్టమొదటిగా చేసిన ఎస్ఎల్‌వీ డీ1 ప్రయోగించి విఫలమయ్యారు. ఒక అపజయం విజయసోపానాలకు మెట్లు అని నిరూపించుకుంటూ 1980లో ఇదే ప్రయోగంలో విజయం సాధించారు. ఆ ప్రయోగంలో కేవలం 40 కిలోల బరువు కలిగిన ఉపగ్రహాన్ని లియో ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి 2013 దాకా ఒకటి, రెండు, మూడు ప్రయోగాలు మాత్రమే చేసేవారు. ఆ తరువాత 2014, 2015, 2017 సంవత్సరాల్లో ఐదేసి ప్రయోగాలు చేశారు. అయితే 2016లో మాత్రం 9 ప్రయోగాలు చేసి చరిత్ర సృష్టించారు. 2018లో ఏడు, 2019లో ఆరు ప్రయోగాలు చేశారు. 2020 నుంచి ప్రయోగాల సంఖ్య పెంచాలని అనుకునే సమయంలో కరోనా మహమ్మారి పుణ్యమా అని 2020, 2021 రెండేసి ప్రయోగాలతో సరిపెట్టుకున్నారు. 2022లో అయిదు ప్రయోగాలు చేసి కాస్తంత పరవాలేదనిపించారు. అదే 2023కు వచ్చేసరికి రాకెట్ వేగంతో ప్రయోగాల వేగాన్ని పెంచి ఏడు నెలల్లో ఆరు ప్రయోగాలు చేసి చరిత్ర సృష్టించారు.

షార్‌లో రాకెట్ లాంచింగ్‌కు అత్యాధునిక సౌకర్యాలు

షార్ కేంద్రంలో నెలకొక రాకెట్ ప్రయోగం చేసుకునేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించడంతో ఈ ఏడాది ఇప్పటికే ఆరు ప్రయోగాలు చేసి చరిత్ర సృష్టించారు. మరో ఆరు ప్రయోగాలు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. ప్రయోగాల సంఖ్యను పెంచుకునే దిశగా షార్‌లో అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చారు. మొదటి ప్రయోగ వేదికకు అనుసంధానంగా ఇటీవలే పీఎస్ఎల్‌వీ రాకెట్ అనుసంధానం భవనాన్ని నిర్మించారు. ఆదివారం ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్ ఈ భవనంలోనే అనుసంధానం చేశారు. మొబైల్ సర్వీస్ టవర్‌లో కూడా రాకెట్ అనుసంధానం చేసుకునే వీలుంది. అంటే మొదటి ప్రయోగవేదికపై ఒకేసారి రెండు రాకెట్‌లు అనుసంధానం చేసుకునే సౌకర్యం ఉంది. రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా రెండు వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్స్, ఒక ఎస్ఎస్ఏబీ బిల్డింగ్ ఉండడంతో ఒకేసారి మూడు రాకెట్‌లు అనుసంధానం చేసుకునే సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా ఒకేసారి అయిదు రాకెట్‌లు అనుసంధానం చేసుకునే అత్యాధునిక సౌకర్యాలు 2022 నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి పది రాకెట్‌లను ట్రాకింగ్ చేసే మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ కేంద్రం కూడా అందుబాటులో ఉంది. దీంతో ఇక నుంచి స్పేస్ రీఫార్మ్ ఇయర్ పేరుతో సంవత్సరానికి 12 రాకెట్‌లు ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. వాణిజ్యపరంగా ప్రపంచదేశాల్లో ఇస్రోకు మంచి డిమాండ్ ఉండడంతో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నారు.

మేత పోరంబోకు భూమి ఆక్రమణ



ఆక్రమణకు గురైన మేత పోరంబోకు భూమి

ఓజిలి: మండలంలోని గుర్రంకొండ గ్రామంలో మేతపోరంబోకు భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. గ్రామంలో సర్వే నంబర్ 103లో 153.10 ఎకరాల మేత పోరంబోకు భూములు ఉన్నాయి. ఈ భూములను 2001వ సంవత్సరంలో నిషేధిత జాబితాలో చేర్చారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మూడెకరాల భూమిని ఆక్రమించి సాగుచేస్తుండగా కొన్ని నెలల క్రితం గ్రామస్తులు అడ్డుకున్నారు. భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గతంలో తహసీల్దార్, వీఆర్వోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఈక్రమంలో కొద్ది రోజులు క్రితం మళ్లీ భూమిలో మొక్కలు నాటి దుక్కి చేస్తుండగా రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యక్తి రెండు రోజులు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఆక్రమించిన భూమిలో జామాయిల్ మొక్కలను నాటారు. గ్రామస్తులు అడ్డుకోగా కేసులు పెడతామని బెదిరిస్తున్నాడని ఆవేదన చెందుతున్నారు. ఈ భూమి రోడ్డు పక్కనే ఉండడంతో రూ.30లక్షలు విలువ చేస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో మేత పోరంబోకు భూములు ఆక్రమణలకు గురైన విషయం సర్పంచ్ ముప్పాళ్ల మాధవీలత రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. భూములు ఆక్రమణ విషయాన్ని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన మేత పోరంబోకు భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భూమిని స్వాధీనం చేసుకోవాలని చెబుతున్నారు.

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

నాయుడుపేట: మండలంలోని రైతులకు నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ ఆదివారం తెలిపారు. రబీ సీజన్‌కు రైతులకు అవసరమైన జీలగ విత్తనాలు పంపిణీకి సిద్ధం ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ప్రతి ఆర్బీకేల్లో తమ ఆధార్‌ను తీసుకుని గ్రామ వ్యవసాయ సహాయకులను కలవాలన్నారు. రూ.790 విలువ చేసే 10 కేజీలు జీలగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో రూ.395లకే ఇస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఆడుదాం ఆంధ్రపై సమీక్ష

పెళ్లకూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులతో మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు ఆదివారం ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్లు, ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

వానాకాలం.. వ్యాధుల గాలం!

- వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు ప్రబలే అవకాశం అధికం
- నిర్లక్ష్యం వహిస్తే మూగజీవాల ప్రాణానికే ప్రమాదం
- 1962కు ఫోన్ చేస్తే ఇంటివద్దకే వైద్యం



పశువుల ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న పశువైద్యులు

దక్కిలి: వర్షాకాలంలో పశువుల్లో వ్యాధులు ప్రబలే అవకాశం అధికం. ఈ సీజనల్‌లో వచ్చే వ్యాధులు సాధారణమైనవే అయినా పాడిపై తీవ్ర ప్రభావం చూపుతాయి. పాడి రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వాటి ప్రాణాలకే ప్రమాదం వాటిల్లవచ్చు. దీంతో పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందార్లు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు పేర్కొంటున్నారు. జీవాలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటే వెంటనే 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవా వాహనంతో వైద్యులే ఇంటికొచ్చి చికిత్స అందిస్తారని చెబుతున్నారు.

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో పశుసంపద

మండలం	గేదెలు	ఆవులు	గొర్రెలు	మేకలు
దక్కిలి	12వేలు	2వేలు	13వేలు	4వేలు
బాలాయపల్లి	8వేలు	600	20వేలు	12వేలు
వెంకటగిరిరూరల్	10వేలు	1500	3వేలు	2వేలు

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం..

గాలికుంటు వ్యాధి ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి వాటికి ఎక్కువగా సోకుతుంది. వ్యాధి బారిన పడిన పశువు శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువు నోట్లో, గిట్ట మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. దీంతో నడిచేందుకు కూడా కష్టపడతాయి. పాడి పశువుల్లో అయితే పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోతోంది. వ్యాధి నివారణ కోసం వైద్యులు సూచనల మేరకు యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉటుంది.

కలుషిత నీటితో జలగ వ్యాధి..

మురుగునీరు, కాలువల్లోని కలుషిత నీరు తాగడం వల్ల పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి సోకుతుంది. గేదెలు, దూడలు, గొర్రెలు, మేకలు వంటి జీవాలకు వస్తుంది. మేత తినడంలో పశువులు బాగా ఇబ్బంది పడతాయి. పాల దిగుబడి క్షీణిస్తుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీలీటర్లు నీయోజడప్లస్‌ను అందించాలి.

నట్టల వ్యాధితో ఎదుగదలకు బ్రేక్..

పశువుల పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో వాటి ఎదుగుదలకు అవకాశం ఉండదు. జీవాలు తిన్న ఆహారం అంతా నులి పురుగులే స్వాహా చేస్తాయి. దీంతో జీవాలు తరచూ రోగాలు బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈవ్యాధి బారినపడతాయి. ఎందుకంటే వర్షాలు పడి అక్కడక్కడ పెరిగే పచ్చి మేతను తిన్నప్పుడు ఈసమస్య ఉత్పన్నమవుతోంది. అందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా ఆరు నెలలుకొకసారి పశువులకు నట్టల నివారణ మందులు ఉచితంగా అందిస్తోంది. ఈఏడాది కూడా నట్టల నివారణ మందులు సకాలంలో వేశారు.

గొంతువాపు..ప్రాణాంతకం

పశువులకు సంక్రమించే వ్యాధుల్లో గొంతువాపు వ్యాధి ప్రాణాంతకమైనది. ఈవ్యాధి బారిన పడిన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ వచ్చి శ్వాస పీల్చడానికి ఇబ్బందులు పడుతుంటాయి. గొంతు కిందకు నీరు దిగి గొంతువాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు జూన్, జూలై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేస్తారు. వ్యాధి బారిన పడిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.

ఇటాస్ వ్యాక్సిన్‌తో చిటుకు వ్యాధికి చెక్..

వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా వ్యాధులు చిటుకు ఒకటి, ఇది సోకినపుడు జ్వరం తీవ్రత ఎక్కువగా ఉటుంది. నివారణ కోసం జూన్, జూలై మాసాల్లో ఐటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు సకాలంలో వ్యాధులను గుర్తించి తగిన వైద్యం అందించడం వలన వాటిని నివారించవచ్చు.



గొర్రెలకు నట్టల నివారణ మందును పెడుతున్న పశువైద్య సిబ్బంది

సకాలంలో చికిత్స చేయించాలి



పశువుల ఆరోగ్యాన్ని గుర్తించిన వెంటనే సమీపంలోని పశు వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువ. ఏదైనా వ్యాక్సిన్ వేయిస్తే దాని ప్రభావం ఆరు నెలలు వరకు ఉంటుంది. నట్టల నివారణ మందులను ఆరునెలలకొకసారి వేస్తాం. గొంతు వాపు, చిటుకు వ్యాధులకు ఉచితంగా వ్యాక్సిన్ అందిస్తున్నాం. పశు సంరక్షణపై ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక పశు వైద్యకేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించవచ్చు.

– శేఖర్, పశువైద్యాధికారి, దక్కిలి

కష్టకాలంలో ఆపద్బాంధవుల్లా..

వలంటీర్లకు వందనం



రూరల్ మండలంలో కోవిడ్ సమయంలో పారిశుధ్య పనులు చేయిస్తున్న వలంటీర్

వెంకటగిరిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన వలంటీర్ వ్యవస్థలోని వలంటీర్లు గ్రామాల్లో సైతం సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటూ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, గ్రామాల్లో క్లోరినేషన్, శానిటైజేషన్ చేయిస్తూ మేమున్నామంటూ సైన్యంలా పని చేశారు. కరోనా సోకిన వారికి అయినవారు, కుటుంబసభ్యులు సైతం ప్రాణభయంతో దూరంగా ఉన్నప్పటికీ ఐసోలేషన్ వార్డుల్లో చేరిన కరోనా బాధితులకు మందులు, ఆహారం అందజేస్తూ వారి బాగోగులు సైతం చూసుకున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కష్టకాలంలో వలంటీర్లు ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్నారని వారి సేవలకు ప్రజలు సలాం కొడుతున్నారు.

వారి సేవలు మరువలేం



కోవిడ్ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. కరోనాతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు, ఆహారం అందిస్తూ లాక్‌డౌన్ సమయంలో నిత్యావసర సరుకులు, కూరగాయలు వంటివి ఇంటివద్దకే తెచ్చి ఇచ్చి ప్రాణాలకు తెగించి సేవ చేశారు.

-పాపయ్య, జంగాలపల్లి

నేడు రొట్టెల పండుగ



చిల్లకూరులోని దో షాహీద్ దర్గా



సయ్యద్ అహ్మద్ షా, సయ్యద్ మహ్మద్‌షా సమాధులు

- దో షాహీద్ దర్గాలో ఏర్పాట్లు పూర్తి

చిల్లకూరు: మొహర్రం పండుగ రోజు నుంచి నెల్లూరులోని భారా షాహీద్ దర్గాలో రొట్టెల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ నిర్వహించే రొట్టెల పండుగకు దేశంలోని ముస్లింలు, హిందువులు వచ్చి ఇక్కడ స్వర్ణాల చెరువులో రొట్టెలు పట్టుకుంటారు. అంతటి ప్రసిద్ధి చెందిన నెల్లూరులోని రొట్టెల పండుగ తరువాత చిల్లకూరులోని దో షాహీద్ దర్గాకు ప్రాముఖ్యత ఉంది. ప్రాచీన కాలంలో ముష్కరులకు, ప్రవక్తలకు జరిగిన ప్రత్యక్ష యుద్ధంలో 13 మంది ప్రవక్తల తలలు తెగనరికిన సందర్భంగా 11 మంది భారా షాహీద్ దర్గా ఉన్న ప్రాంతంలో పడిపోగా సయ్యద్ మహ్మద్ షా, సయ్యద్ అహ్మద్ షా అనే సహోదరులు ఇద్దరి తలలు తెగినప్పటికీ గుర్రాలపై మిగిలిన శరీరం చిల్లకూరు దర్గా నిర్మించిన ప్రాంతంలో పడిపోయినట్లు ఈ ప్రాంతవాసులు చెబుతుంటారు. బొబ్బిలికి చెందిన ఓ రాణి చెన్నైకు వెళుతూ మార్గమధ్యలో చిల్లకూరు ప్రాంతంలో సేద తీరిన సమయంలో ఆమె కలలో ప్రవక్తలైన ఇద్దరు సహోదరులు కనిపించి తమకు దర్గా నిర్మించాలని కోరారట. దీంతో ఆమె బొబ్బిలికి వెళ్లిన తరువాత ఈ ప్రాంతంలో దర్గా (సమాధులు) నిర్మించారు. అప్పటి నుంచి మొహర్రం సందర్భంగా రొట్టెల పండుగను నిర్వహిస్తున్నారు. నెల్లూరులో రొట్టెల పండుగ ప్రారంభమైన మూడవ రోజున చిల్లకూరులో ఒక్క రోజు పండుగను ఆచరిస్తారు. ఈ క్రమంలోనే సోమవారం చిల్లకూరులోని దో షాహీద్ దర్గాలో రొట్టెల పండుగను నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లి జుబేద్ తెలిపారు. రొట్టెల పండుగను పురస్కరించుకుని నెల్లూరుకు వెళ్లిన ప్రతి భక్తుడు ఇక్కడ దర్గాలో సమాధులను దర్శించుకుని కోర్కెలను తీర్చుకుంటారు.

మహాసభలను జయప్రదం చేయండి



ఎన్జీఓల అధ్యక్షులకు వినతిపత్రం ఇస్తున్న ఎన్జీఓలు

గూడూరురూరల్: ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీఎన్జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏపీఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నెపల్లి పెంచలరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీఎన్జీఓ అసోసియేషన్ భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సభల్లో ఏకతీర్మానం చేసే విధంగా పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలోని ఎన్జీఓలు మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని అన్నారు. జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, బండారు వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, ఆంజనేయవర్మ, శ్రావణ్‌కుమార్, తనూజ్‌కుమార్, నాగరాజుకుమార్, అశోక్, ఖాదర్‌బాషా, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఘర్షణపై విచారణ

కోట: విద్యానగర్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణపై ఆదివారం పోలీసులు విచారణ జరిపారు. గోవిందపల్లికి చెందిన ఓ విద్యార్థిపై రెండు రోజుల క్రితం కొందరు విద్యార్థులు విద్యానగర్‌లో దాడికి పాల్పడిన క్రమంలో వివాదం సద్దుమణగక పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. దీనిపై ఇరువర్గాల వారిని పిలిచి మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

కండలేరులో 17.582 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 17.582 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకాలువకు 930 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 50, లోలెవల్ స్లూయిజ్‌కు 60 క్యూసెక్కుల వంతునవిడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ఘనంగా మొహర్రం



వేణుంబాకంలో పీర్ల చావిడి

దొరవారిసత్రం: కల్లూరులో మొహర్రం పండుగ సందర్భంగా స్థానిక పీర్ల చావిడి వద్ద ముస్లింలు పీర్ల పండుగను శనివారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా వేణుంబాకం గ్రామంలో ఆదివారం రాత్రి ముస్లింలు పీర్లను పూలతో అలకరించి వీధుల్లో ఊరేగించారు. చావిడి వద్ద అగ్నిగుండం వేశారు. భక్తిశ్రద్ధలతో ముస్లింలు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



విన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న శ్రీచైతన్య జట్టు

- డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి
- అంతర పాఠశాలల క్రికెట్ విజేత శ్రీచైతన్య జట్టు



రన్నర్స్ ట్రోఫీని అందుకుంటున్న లిటిల్ ఏంజెల్స్ జట్టు

గూడూరురూరల్: విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థితికి చేరాలని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర పాఠశాలల క్రికెట్ టోర్నీ విజేతగా శ్రీచైతన్య స్కూల్ జట్టు, రన్నర్స్‌గా లిటిల్ ఏంజెల్స్ స్కూల్ జట్టు నిలిచాయి. ఆదివారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో శారీర దారుఢ్యంతోపాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. అంతేకాకుండా విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుంటారని తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు, రోటరీ మాజీ గవర్నర్ముని గిరీష్, అసిస్టెంట్ గవర్నర్ మయూరి శబ్బీర్ యాదవ్, రొటేరియన్లు దశరథరామిరెడ్డి, నాగేశ్వరరావు, లవకుమార్ పాల్గొన్నారు.